AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
18-8-2026 (Tuesday) MAIN EDITION

## ఆలయంలో బర్త్‌డే పార్టీ



**అక్షరటుడే, ఏపీ:** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఒక ఘటన ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. మెగా హీరో సాయి దుర్గా తేజ్ స్వామివారిని దర్శించుకునేందుకు కాణిపాకం వెళ్లారు. ప్రత్యేక పూజలు ముగించుకుని గెస్ట్ హౌస్‌లో ఉన్న సమయంలో.. ఆగస్ట్ 22న జరగనున్న మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి జరుపుకున్నారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో భక్తులు, నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## ప్రశ్న రావణ్ కేసులో కొత్త మలుపు



**అక్షరటుడే, విజయవాడ :** యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న' రావణ్ కేసుకు సంబంధించిన విచారణ గన్నవరం కోర్టు నుంచి విజయవాడకు బదిలీ అయింది. ఆయనపై నమోదైన తీవ్రమైన ఉపా చట్టం సెక్షన్ల పరిధి, న్యాయ పరిమితుల దృష్ట్యా.. ఈ కేసు రికార్డులను గన్నవరం కోర్టు నుంచి విజయవాడ 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు, అలాగే ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## సీజేపీ ఆందోళనలపై స్వతంత్ర దర్యాప్తు



అక్షరటుడే, న్యూ ఢిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలపై సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. రిటైర్డ్ జడ్జి, డీజీపీ నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించింది.

## ఐపీవోకు 'కేరళ స్టోరీ' నిర్మాణ సంస్థ..




అక్షరటుడే, బిజినెస్ డెస్క్: కేరళ స్టోరీ, బస్తర్ వంటి చిత్రాలను నిర్మించిన సన్‌షైన్ పిక్చర్స్ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. కంపెనీ రూ. 282.14 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో ఐపీవోకు వస్తోంది. కంపెనీ ప్రైస్ బ్యాండ్‌ను రూ. 342 నుంచి రూ. 360 లుగా నిర్ణయించింది. గ్రే మార్కెట్ ప్రీమియం రూ. 73 గా ఉంది.

## భారీగా నకిలీ నెయ్యి పట్టివేత



అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీగా నకిలీ నెయ్యిని అధికారులు పట్టుకున్నారు. హెచ్ ఫాస్ట్ అధికారులు 25 టన్నుల నకిలీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. 10 టన్నుల నెయ్యి తయారీ ముడిపదార్థాలు సీజ్ చేశారు. నకిలీ నెయ్యి తయారు చేస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను చేశారు.

**తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పన ఇస్తామని నేత కవిత సంచలన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం లావాదేవీలే కావొచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు జరిగినా ముందుగా తీసుకుంటున్నవి అసైన్డ్ భూములేనని ఆమె మండిపడ్డారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




### మేకవన్నె పులిలా రేవంత్ రెడ్డి..

గత 31 నెలల్లో ఏనాడూ సామాజిక న్యాయం పదం ఉచ్చరించని ముఖ్యమంత్రి, ఇప్పుడు ఆ గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రేవంత్ రెడ్డి 'సామాజిక అన్యాయం' అనబోయి 'సామాజిక న్యాయం' అన్నారని, ఆయన మాటలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. రేవంత్ రెడ్డి కేబినెట్‌లోనే సామాజిక న్యాయం లేదని, పదవులు ఇచ్చే అవకాశం ఉండి కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎందుకు న్యాయం చేయడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి మేకవన్నె పులిలాంటి వారని విమర్శించారు.

# పేదలకు ఎకరం భూమి

- అధికారంలోకి రాగానే భూ లక్ష్మి పథకం
- కాంగ్రెస్ పాలనలో బీసీలక అన్యాయం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగుతోందని కవిత ఆరోపించారు. రేవంత్ రెడ్డి తమ్ముళ్లు భూ దొంగలని, అనగనగా ఒక రాజు ఏడుగురు కొడుకులు అన్నట్లుగా వారి భూదోపిడీ సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల పాలన సాగుతోందని, ఇంతమంది రాజ్యాంగేతర శక్తుల దోపిడీ ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాగేసుకుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు.

### బీసీలకు తక్కువ జీతాలు


ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లో బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. సలహాదారులుగా నియమితులైన వారిలో బీసీ వర్గానికి చెందిన నేత జీతం ఇతరుల కంటే ఎందుకు తక్కువగా ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషనర్ల నియామకంలోనూ ఒక్క బీసీకి కూడా అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని కవిత విమర్శించారు. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే 56 శాతం ఉన్న బీసీల కోసం ఖర్చు చేసింది 0.999 శాతం మాత్రమే అని కవిత పేర్కొన్నారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం అమలు




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం అమలులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి వన్ వే అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేబీఆర్ నిత్యం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. దీనిని నివారించడాని ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మిస్తోంది. వీటి పనుల కోసం వన్ వే అమలు చేస్తామని ఇటీవల పోలీసులు ప్రకటించారు. ఈ మేరకు తాజాగా వన్ వే విధానం అమలు చేశారు. ఏడాదిన్నర పాటు వన్‌వే విధానం అమలు ఉంటుంది. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సూచిక బోర్డులు ఏర్పాటుతో పాటు కేబీఆర్ పార్క్ చుట్టు 1000 మంది పోలీసులను మోహరించారు. అయినా తొలిరోజు కావడంతో వాహనాదారులు గందరగోళానికి గురి అవుతున్నారు.

## మిల్కీ మిస్ట్.. లిస్టింగ్ అదుర్స్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** స్టాక్ మార్కెట్‌లో మంగళవారం మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ లిమిటెడ్ కంపెనీ షేర్లు లిస్టయ్యాయి. 17.86 శాతం లాభాలతో లిస్టై.. కొద్దిసేపటికే అప్పర్ సర్క్యూట్ ను తాకాయి. మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ లిమిటెడ్ కంపెనీ ఐపీవో బిడ్డింగ్ ఆగస్టు 11న ప్రారంభమై 13న ముగిసింది. ఈ పబ్లిక్ ఇష్యూకు భారీ స్పందన లభించింది. ఒక్కో ఈక్విటీ షేరును కంపెనీ రూ. 140 కి విక్రయించగా.. 17.86 శాతం ప్రీమియంతో రూ. 165 వద్ద లిస్టయ్యాయి. ఆ తర్వాత కొద్ది సేపటికే రూ. 181.50 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి.

## ఉరిశిక్షపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, ఢిల్లీ:** ఉరిశిక్షపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉరిశిక్షకు బదులుగా విషపు ఇంజెక్షన్ వంటి తక్కువ బాధ కలిగించే ఇతర పద్ధతులను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది. ఉరిశిక్ష రాజ్యాంగబద్ధతను సమర్థిస్తూ, దేశంలో ప్రస్తుతానికి ఉరిశిక్ష అమలు పద్ధతిగానే కొనసాగుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుడికి తక్కువ నొప్పి కలిగించే, వారి గౌరవాన్ని కాపాడే విధంగా మరణశిక్షను అమలు చేయడానికి, ఉరిశిక్షకు బదులుగా ఒక ప్రత్యామ్నాయ పద్ధతిని అవలంబించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది.

## మహారాష్ట్ర ఎఫ్‌డీఏకు షాక్




**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్ర ఎఫ్‌డీఏకు బాంబే హైకోర్టు షాక్ ఇచ్చింది. ఓ స్వీట్ షాపు లైసెన్స్ నిలిపివేసినందుకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆహారశాలలు, హోటళ్ల లైసెన్సులను నిలిపివేస్తూ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) జారీ చేసిన ఉత్తర్వు విచిత్రమైన, విపరీతమైన విధానం అని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర ఘుగే, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పూణేలోని గురునానక్ డైరీ అండ్ స్వీట్స్ దుకాణాన్నిఅధికారులు తనిఖీ చేశారు. పారిశుధ్యం, సిబ్బంది పరిశుభ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ దుకాణం లైసెన్సును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది.

## విద్యార్థులే లక్ష్యంగా వడ్డీ దందా!

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** చదువు కోసం హైదరాబాద్ నగరానికి వచ్చే విద్యార్థులే లక్ష్యంగా కొందరు వడ్డీ దందా చేస్తున్నారు. అధిక మిత్తికి డబ్బులు ఇచ్చి వారి కుటుంబాలను ఆగం చేస్తున్నారు. అంతేగాకుండా విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావడానికి సాయ పడుతున్నారు. కొందరు విద్యార్థులు స్నేహితులతో సరదాగా గడపడానికి, గర్ల్ ఫ్రెండ్‌తో సినిమాలు, షికార్లకు వెళ్లడానికి, పార్టీల కోసం బయట అప్పులు చేస్తున్నారు. తల్లిదండ్రులకు చెప్పకుండా.. బయట వడ్డీకి డబ్బు తీసుకుంటున్నారు. ప్రతి నెలా కొంత మొత్తం అడ్జస్ట్ చేస్తామనే ధీమాతో అప్పులు తీసుకుంటున్నారు. వడ్డీ వ్యాపారులు రూ.100కు ప్రతినెలా రూ.10 నుంచి రూ.20 వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. అవసరం కొద్ది డబ్బులు తీసుకుంటున్న విద్యార్థులు.. తర్వాత వాటిని చెల్లించలేకపోతున్నారు. తల్లిదండ్రులు కష్టపడి ఆ అప్పులు చెల్లిస్తున్నారు. విద్యార్థులే లక్ష్యంగా అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



## అయోధ్య విరాళాల కేసులో చంపత్ రాయ్‌కు క్లీన్‌చిట్



**అక్షరటుడే, యూపీ :** అయోధ్యఆలయ విరాళాల చోరీ, నిధుల దుర్వినియోగం ఆరోపణల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక ప్రకటన చేసింది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రాలకు క్లీన్‌చిట్ ఇచ్చింది. విరాళాల వ్యవహారంలో వీరిద్దరి ప్రమేయం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులు, బ్యాంక్ ఖాతాలు , ఆర్థిక లావాదేవీలను దర్యాప్తు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చారు. చోరీ అయిన నిధులకు, బ్యాంక్ లావాదేవీలకు ట్రస్ట్ ఉన్నతాధికారులకు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధం లేదని సిట్ అధికారులు తేల్చిచెప్పారు.



## భూములను నిషేధిత జాబితాలో ఎందుకు పెట్టారు

**అక్షరటుడే, మల్కాజ్‌గిరి:** కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు చేశారు. భూములను 22Aలో జాబితాలో ఎందుకు పెట్టింది? ఎవరు పెట్టామన్నారు అని ప్రశ్నించారు. 60 ఏళ్ల నుండి ఉంటున్న ఇల్లును 22A నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరిలో నిర్వహించిన నిషేధిత జాబితా భూ బాధితుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. రాత్రికి రాత్రే కాలనీలు, లే అవుట్లు, హెచ్ఎండీఏ, హుడా అమ్మిన భూములు, వేలంలో ప్రభుత్వం అమ్మిన భూములను నిషేధిత జాబితాలో పెడితే ప్రజలు ఏమైపోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అక్రమాలకు ప్రజలు ఎందుకు కష్టాలు పడాలని ఆయన ప్రశ్నించారు.

## విద్యార్థినికి ప్రిన్సిపాల్ వేధింపులు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఒక ఇంటర్ విద్యార్థినిని కీచక ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు గురి చేశాడు. రాజస్థాన్ పుష్కర్ సమీపంలోని కదేల్ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని వద్ద రిజిస్ట్రేషన్ ఫీజు కట్టేందుకు డబ్బులు లేవు. దీంతో తన తండ్రికి జీతం రాగానే డబ్బు చెల్లిస్తానని ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్‌కు బాలిక చెప్పింది. ఇదే అదునుగా.. తన కోరిక తీర్చాలంటూ ఆ విద్యార్థిని పట్ల ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తించాడు. కాలేజీ ముగిశాక సాయంత్రం తనతో సమయం గడిపితే.. ఫీజు మాఫీ చేస్తానన్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో కాలేజీకి చేరుకొని ప్రిన్సిపాల్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

